క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువత

కర్నూలు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షఫీ పాషా ఖాద్రి అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక లతీఫ్ లావుబాలి దర్గా మైదానంలో కేర్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల వారు ఆరోగ్యంగా ఉండడమే కాక, మరొకరి ప్రాణాలు రక్షించిన వారవుతారన్నారు. ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. కమిటీ నేతలు సయ్యద్ తాహాఖాద్రీ, సయ్యద్ జునైద్ ఖాద్రీ, సయ్యద్ ఆకిఫ్ పాషా ఖాద్రీ, సంయుక్త కార్యదర్శి ఎస్.నజీర్‌హుసేన్, కార్పొరేటర్ ఎస్ యూనుస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. సోమవారం నగరంలోని వడ్డెగేరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ప్రతి రోజూ కనీసం రాత్రి 10 గంటలు, పగలు రెండు గంటలువిశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రక్తహీనత లేకుండా సురక్షితమైన ప్రసవం కోసం ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా పట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంలో ప్రతిభ

కర్నూలు సిటీ: నగరంలోని ఓ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన భగవద్గీత పఠనం పోటీల్లో తమ పాఠశాల నుంచి 8వ తరగతి విద్యార్థి టి.సురేంద్ర ప్రతిభ కనబరచడం అభినందనీయమని ఆదర్శ విద్యాసంస్థల అధినేత బి.తిమ్మయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత ప్రతి రోజు చదవడం వల్ల పిల్లల జ్ఞాపకశక్తిని మరింతగా పెంచుతుందన్నారు. దృష్టి, ఏకాగ్రతను మెరుగుపరుస్తుందన్నారు. పాఠశాల దశ నుంచే పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే డ్యూటీ రోస్టర్ వేయాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాల్గవ తరగతి ఉద్యోగులకు పాత పద్ధతిలోనే డ్యూటీ రోస్టర్ వేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం యూనియన్ నాయకులతో కలిసి పలువురు ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్ వద్ద ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కొందరు అధికారులు కింది స్థాయి ఉద్యోగుల పట్ల కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకపోతే ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అబ్రహం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలునాయక్, ట్రెజరర్ ఎం.సురేష్, సెక్రటరీ ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారిణికి అభినందన

కర్నూలు (టౌన్): అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు పతకం దక్కింది.గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 4వ తేదీ వరకు నేపాల్‌లోని పోఖారలో ఎస్‌బీకేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో 57 కేజీల విభాగంలో కర్నూలుకు చెందిన రేష్మా బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తన స్వగృహంలో పవర్ లిఫ్టర్‌ను అభినందించారు. మన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం శుభపరిణామమన్నారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్య దర్శి వేణుగోపాల్, లోకేష్, గోపి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జిల్లా విద్యా-వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు పిలుపునిచ్చారు. సోమవారం కృష్ణాకాంత్ ప్లాజాలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఓక్ జూబ్లీ వేడుకలు, జిల్లా విద్యా, వైజ్ఞానిక మహాసభను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర స్థాయి వేడుకలు విజయనగరంలో అక్టోబరు 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జల విలయానికి కారణం చంద్రబాబే

- ముఖ్యమంత్రి ఇల్లు మునగకుండా కాపాడుకునేందుకు విజయవాడను ముంచారు
- సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం
- ఎనిమిది రోజులు దాటినా బాధితులకు ఆహారం అందించలేని దుస్థితి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి



ఎస్వీ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు (టౌన్): పబ్లిసిటీ పిచ్చి.. అత్యుత్సాహంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో వరద బాధితులకు నరకం చూపిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. విపత్తుకు ముఖ్య కారణం చంద్రబాబే అని, ఆయన ఇల్లు మునిగిపోకుండా కాపాడుకునేందుకు బుడమేరు నుంచి నీటిని వెలగనూరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడకు మీదకు వదిలేసింది నిజం కాదా అని ప్రశ్నించారు? విజనరీ ముఖ్యమంత్రిగా నిరంతరం భజన చేయించుకునే చంద్రబాబు విజయవాడలో జరిగిన విపత్తుకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ముందస్తు సమాచారం ఉన్నా అసమర్థ ప్రభుత్వం వల్లే విజయవాడ నీట మునిగిందని, ఎనిమిది రోజులు దాటినా ప్రభుత్వం ఆదుకోకపోవడంతో తిండి, నీళ్ల లేక ప్రజలు నరకం అనుభవిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరదల్లో 50 మందికి పైగా చనిపోయారని, రూ.లక్ష కోట్ల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ఫొటోలకు ఫోజులిస్తున్న ముఖ్యమంత్రి వరదల్లో హడావుడి చేయడం, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడం తప్పా ఏం చేశారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో రిటైనింగ్ వాల్ నిర్మించి కొన్ని ప్రాంతాలకు వరద ముప్పును తప్పించారని వివరించారు. విపత్తులు వచ్చిన సమయంలో అధికారులను అప్రమత్తం చేయడం సహాయక చర్యలను పరిరక్షించడం, వలంటీర్ల ద్వారా బాధితులను సత్వర సేవలు అందించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు జేసీబీ ఎక్కి ఫొటోలకు ఫోజులివ్వడం, 4 అడుగుల నీటిలో అధికారులను తిప్పుతూ ఏం సాధించారని ప్రశ్నించారు. రోజుకు మూడుసార్లు ప్రెస్‌మీట్లు పెట్టి సహాయక చర్యలు చేపట్టాల్సిన వారిని మీటింగ్‌ల పేరుతో ఇబ్బంది పెట్టలేదా అని నిలదీశారు. మంత్రులు ఒకరిపై ఒక్కరూ నిందలు మోపుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని యద్దేవా చేశారు. వరద బాధితులను ఆదుకోవడం, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, కనీసం మంచినీరు, ఆహార పదార్థాలు సైతం అందించడంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. బియ్యం పంపిణీ వాహనాలను నిత్యం విమర్శించిన టీడీపీ నేతలకు చివరికి అవే దిక్కు అయ్యాయని యద్దేవా చేశారు. అ వాహనాల్లోనే వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్నారన్నారు. విజయవాడలో జల విలయానికి ప్రభుత్వం వైఫల్యమే కారణమని విమర్శించారు.

పుకార్లు, వదంతులు నమ్మొద్దు



మాట్లాడుతున్న సీఐ రామయ్యనాయుడు

కర్నూలు: గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎవరైనా పుకార్లు, వదంతులు సృష్టిస్తే నమ్మవద్దని ఒకటవ పట్టణ సీఐ రామయ్యనాయుడు గణేష్ ఉత్సవ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. పాతబస్తీలోని కింగ్ మార్కెట్ వద్ద ఉన్న లక్ష్మీ కళ్యాణ మండపంలో గణేష్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్టేషన్ పరిధిలో 80కి పైగా గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక, డ్రమ్ముల్లో నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పుకార్లు, వదంతులు నమ్మి యువకులు ఆవేశాలకు లోను కాకూడదని, ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసులను సంప్రదించి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్ఐలు సోమ్లానాయక్, ఖాన్, గణేష్ ఉత్సవ విగ్రహాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మానసిక దృఢత్వంతో విజయం తథ్యం



మాట్లాడుతున్న సైకాలజిస్టు సిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): మానసికంగా దృఢంగా ఉంటేనే విజయం సాధించగలుగుతారని సైకాలజిస్టు సిరిగిరెడ్డి జయారెడ్డి చెప్పారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌ఏపీ క్యాంపులోని సీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, విద్యా హిప్నాటిజం సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిగిరెడ్డి జయరెడ్డి మాట్లాడుతూ.. ఆత్మహత్యలు చేసుకోవాలనే వారి ప్రవర్తనను తల్లిదండ్రులు ముందే గుర్తించి మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స ఇప్పించాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. యువత క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయం తీసుకోరాదన్నారు. మానసిక దృఢ సంకల్పంతో ఆత్మనూన్యతకు గురిచేసిన అంశాన్ని పాజిటివ్ దృక్పథంతో తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల మానసిక స్థితిగతులను గమనిస్తూ ఉండాలని చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు పీసీ పవన్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



కమిషనర్ రామలింగేశ్వర్‌కు సమస్యలను వివరిస్తున్న కాలనీ ప్రజలు

కర్నూలు (టౌన్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదేశించారు. స్థానిక నగరపాలకలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలువురు తమ కాలనీ సమస్యలపై నేరుగా కమిషనర్‌ను కలిసి వినతిపత్రాల ద్వారా విన్నవించారు. కార్యక్రమంలో మొత్తం 18 అర్జీలు వచ్చాయి. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ వేణుగోపాల్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్, కార్యదర్శి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని

- జొహరాపురంలో ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల అసోసియేషన్ కాలనీ, పెద్దపాడు రోడ్డులోని వాసవీనగర్‌లో రహదారులు నిర్మించాలని స్థానికులు అరవింద్, బాస్కర్, వెంకటస్వామి కోరారు.
- రిచ్మండ్ విల్లాస్‌లో రహదారులు, మురుగు కాల్వలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీ వాసులు మల్లెల పుల్లారెడ్డి విన్నవించారు.
- వరద సహాయక చర్యలో పాల్గొనేందుకు విజయవాడకు వెళ్లిన 200 మంది కార్మికులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వసతులు కల్పించాలని సీఐటీయూ నాయకులు అంజిబాబు, విజయ్ అభ్యర్థించారు.
- దిన్నెదేవరపాడు రహదారి గుంతలమయంగా మారిందని, ప్యాచ్ వర్కులు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు శామ్యూల్ వినతి పత్రం ఇచ్చారు.
- పాతబస్తీ సవేర హోటల్ వద్ద కల్వర్టు నిర్మించాలని, చత్రీబాగ్‌లో మ్యాన్‌హోల్ తెరిచి ఉంచడం వల్ల స్థానిక కాలనీల వాసులు చెత్త చెదారం వేస్తున్నారని, ఆ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు షరీఫ్ కోరారు.
- ఆరోరానగర్‌లో కాంక్రీట్ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు గోపాల్, రాము కోరారు.

సంక్షిప్తం

28న కవయిత్రుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నగర శివారు ఆర్టీసీ కాలనీలోని గణేష్ సాహితీ సదన్‌లో 7వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త తెలిపారు. సమ్మేళనంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలు, పేర్ల నమోదుకు 94402 28999 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆర్‌యూలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏపీ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాన్‌టీచింగ్ ఉద్యోగులకు టైంస్కేల్ ఇచ్చి హెచ్ఆర్, ఐఆర్ వర్తింపు, ఉద్యోగాల భర్తీ, తప్పుడు ధ్రువపత్రాలు తదితర వాటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్వేరో జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ, భీమ్ ఆర్మీ నాయకులు దానం, రాజు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని హత్యాచార కేసును ఛేదించాలి

కర్నూలు(హాస్పిటల్): కోల్‌కోతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థిని హత్యాచారం కేసును త్వరగా ఛేదించి నేరస్తులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ గైనకాలజీ, ఆబ్‌స్ట్రిక్స్ సొసైటీ(ఫాగ్సీ) సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఘటన జరిగి 30 రోజులైనా కేసులో ఎలాంటి పురోగతి లేదన్నారు. కేసును త్వరగా తేల్చకపోతే ఆందోళనలకు దిగుతామని స్పష్టం చేశారు. ఐఎంఏ కర్నూలు శాఖ అధ్యక్షుడు రామచంద్రనాయుడు,డాక్టర్లు, పీజీలు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో సోమవారం యువజన సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి, సెట్కూరు సీఈఓ దీప్తి పాల్గొని ప్రసంగించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు సిటీ: కర్నూలు-2 డిపో పరిధిలోని గ్రామాలకు సంబంధించి బస్సు రవాణా సమస్యల పరిష్కారం కొరకు, సలహాలు స్వీకరించేందుకు నేడు(మంగళవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రయాణికులు 99592 25794 నంబరు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు.

జెన్‌కో పవర్‌స్టేషన్ల టారిఫ్ విడుదల

కర్నూలు(న్యూసిటీ): ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్రంలో జెన్‌కో ఉత్పత్తి చేసే పవర్ స్టేషన్ల టారిఫ్‌ను నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల టారిఫ్ వివరాలు ప్రకటించారు. వాటాదారుల నుంచి పబ్లిక్ అభ్యంతరాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని కమిషన్ ఉత్పాదక స్టేషన్ల టారిఫ్‌లను నిర్ణయించారు. ఈ వివరాలను కమిషన్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

టైం స్కేల్‌ను రద్దు చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వర్తింప చేసిన అక్రమ టైం స్కేల్‌ను రద్దు చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు (న్యూసిటీ): గణేష్ నిమజ్జన కార్యక్రమాల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం నగరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరినో బుల్ సబ్‌స్టేషన్ పరిధిలో స్తంభాలను మార్చడం, మరమ్మతు పనులు చేపట్టడంతో స్టేట్‌బ్యాంకు ఆఫీసర్స్ కాలనీ, అమీన్ హైదర్ నగర్, సుంకేసుల రోడ్డు, ధనలక్ష్మీ నగర్, శ్రీనగర్ కాలనీ, జనార్దన్ నగర్, వసంత రెసిడెన్సీ, తుంగభద్ర కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.

ఒక్క క్షణం..!

చిన్న సమస్యలే పెద్దవిగా భావించి కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తమకు ఎవరూ లేరని.. విలువైన ప్రాణాలను క్షణంలో తీసుకుంటున్నారు. ఒక్కోసారి కుటుంబ సభ్యులు మొత్తం ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ చేస్తే ఆత్మహత్య ఆలోచన నుంచి బయటపడతారు. ఈ నెల 10వ తేదీన 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఆత్మహత్య చేసుకునే ముందు ఆలోచించాలి
- సన్నిహితులతో మాట్లాడాలి
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక జబ్బుల విభాగానికి వచ్చిన రోగులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒక చోట ఆత్మహత్య, ఆత్మహత్యాయత్నం సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి చిన్నకుటుంబాలు ఏర్పడటం, వారికి చిన్న సమస్య వచ్చినా సర్ది చెప్పేవారు లేకపోవడం, భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం, పిల్లలకు మంచి విషయాలు చెప్పేవారు లేకపోవడం, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, టీవీ సీరియళ్లు మొదలైన అంశాలు ఆత్మహత్యలు పెరిగేందుకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఆత్మహత్యతో మరణించే వారిలో ఎక్కువ మంది మానసిక ఆరోగ్య సమస్యలైన డిప్రెషన్, మత్తు-మద్యం వినియోగ రుగ్మత ఉన్న వారు, సైకోసిస్, పర్సనాలిటీ డిసార్డర్స్‌తో బాధపడేవారు ఉన్నారు. వీరితో పాటు ఆర్థిక సంక్షోభం, సంబంధాల వైఫల్యాలు, అవమానం, సన్నిహిత కుటుంబ సభ్యుడి మరణం, తీవ్రమైన అనారోగ్యం ఇవన్నీ ఒక వ్యక్తిలో ఆత్మహత్య ధోరణిని పెంచుతున్నాయి.

మానసిక ఆరోగ్య కార్యక్రమంతో చికిత్స

ప్రజల్లో మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2018 సెప్టెంబర్ ఒకటో తేదీన మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మానసిక సమస్యల పరిష్కారానికి గాను ఒక మానసిక వైద్యుడు, ఒక సైకాలజిస్టు, మానసిక వైద్యనర్సు, సోషల్ వర్కర్ మంజూరు కాగా ప్రస్తుతం ఒక సైకియాట్రిస్ట్, ఒక సోషల్ వర్కర్ మాత్రమే ఉన్నారు. వీరు ప్రతి నెలా జిల్లాలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీలను సందర్శించి మానసిక రోగులకు తగిన మందులు, అవసరమైన కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నారు. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలోనూ రోగులకు అవసరమైన మందులు, కౌన్సెలింగ్ ద్వారా ఆత్మహత్య ఆలోచనల నుంచి మానసిక వైద్యులు దూరం చేస్తున్నారు. ఇక్కడ ప్రతి వారంలో రెండు ఓపీలు నిర్వహిస్తూ నెలకు 50 నుంచి 60 మందికి వైద్యసేవలు అందిస్తుండగా అందులో 10 మంది ఆత్మహత్య ఆలోచనలతో వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలలోని మానసిక జబ్బుల విభాగానికి ప్రతిరోజూ 100 నుంచి 150 మంది వరకు చికిత్స కోసం వస్తుంటారు. అలాగే ప్రైవేటుగా ఉండే మానసిక వ్యాధి నిపుణుల వద్దకు సైతం ప్రతిరోజూ 400 నుంచి 500 మంది చికిత్స కోసం వస్తారు. ఇందులో 10 శాతానికి పైగా ఆత్మహత్య ఆలోచనలతో ఉంటున్నారు.

బలవన్మరణాలకు కారణాలు ఇవీ..

- ఆత్మహత్యకు చాలా సందర్భాల్లో బలమైన కారణాలు ఉండకపోవచ్చు. ఒక వ్యక్తి బాగా మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు, సమస్యకు పరిష్కారం లభించనప్పుడు, తమకు ఏం చేయాలో, సమస్య నుంచి ఎలా బయట పడాలో తెలియక, దిక్కుతోచనిస్థితిలో ఉన్నప్పుడు ఆత్మహత్యకు పాల్పడతారు.
- ఉద్యోగం లేదని, సంబంధ బాంధవ్యాల్లో సమస్యలు, గతంలో జరిగిన చెడు విషయాలు, మానసిక ఆరోగ్య సమస్యలు, మత్తు మందులకు బానిసలు కావడం, ఎక్కువగా నిరాశకు గురికావడం, కుటుంబ చరిత్రలో ఆత్మహత్యా ప్రయత్నాలు, విపరీతమైన అప్పులు, జీవితంపై నమ్మకం లేకపోవడం, వ్యవసాయంలో నష్టాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం ఇవీ ఆత్మహత్యలకు కారణాలుగా నిలుస్తున్నాయి.

ఆత్మహత్యను సూచించే సంకేతాలు

- హఠాత్తుగా నిద్ర, ఆహార అలవాట్లు మారడం
- ఇతరులకు భారం అవుతున్నట్లు మాట్లాడటం
- మోసగించబడినట్లుగా మాట్లాడటం
- జీవించడానికి ఎలాంటి కారణం లేదని చెప్పడం
- కుటుంబం,స్నేహితుల నుంచి దూరంగా ఉండటం
- వీడ్కోలు పలకడానికి వ్యక్తులను కలవడం, పిలవడం
- విలువైన వస్తువులు వేరే వారికి ఇచ్చేయడం
- గతంలో జరిగిన విషయాలకు క్షమించమని అడగడం
- తరచూ అంతా అయిపోయిందని చెప్పడం
- భరించలేని బాధలో ఉండటం, ఏడవడం
- చిరాకు చికాకుతో ఉండటం
- ఒంటరిగా ఉండటం

ఇది ఒక ప్రజారోగ్య సవాలు



ఆత్మహత్య అనే ఆలోచన ఒక ప్రధాన ప్రజారోగ్య సవాలు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 7లక్షల కంటే ఎక్కువ మంది ఆత్మహత్య ద్వారా మరణిస్తున్నారు. ప్రతి ఆత్మహత్య సుదూర సామాజిక, భావోద్వేగ, ఆర్థిక పరిమాణాలను కలిగి ఉంటోంది. ఈ యేడాది ఆత్మహత్యల నివారణ దినోత్సవ త్రైవార్షిక థీమ్‌గా 'సంభాషణ ప్రారంభించు' అని ఉంది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారి మానసిక సమస్యలు తెలుసుకుని, వారిలో ఆత్మహత్యకు సిద్ధమైన వారు ఉంటే అలాంటి వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన సైకియాట్రిక్ మందులు అందిస్తున్నాం. తద్వారా వారు ఆత్మహత్య ఆలోచనల నుంచి బయట పడుతున్నారు.

–డాక్టర్ నాగేశ్వరరావు, సైకియాట్రీ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

అవగాహన కల్పిస్తున్నాం



ఇటీవల కాలంలో ఎక్కువగా 15 నుంచి 29 సంవత్సరాలోపు వారు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. ఆత్మహత్య ఆలోచన నివారించదగినది. తొందరపడి ఏమీ చేయొద్దని ధైర్యం చెప్పాలి. వారిని ఒంటరిగా వదలకూడదు. దగ్గరలోని మానసిక వైద్యులను కలిసి చికిత్స చేయించాలి. స్నేహితులు, కుటుంబసభ్యులతో వారిని గడిపేటట్లు చేయాలి. సమస్యలు అందరికీ ఉంటాయని నచ్చజెప్పాలి. ప్రతి సమస్యకు సమాధానం లభిస్తుందని, ఓపిక పట్టాలని సూచించాలి. సమస్యను చిన్నదిగా చూడాలని తెలపాలి. ప్రతి సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని చెప్పాలి. జిల్లాలో మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం. మానసిక సమస్యలను ఎలా గుర్తించాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలి అని వివరిస్తున్నాం.

– డాక్టర్ చైతన్య కుమార్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి

సీఎం సహాయ నిధికి విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న దాతలు

కర్నూలు కల్చరల్: ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.1,01,116 విరాళం అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, కార్యదర్శి కె.రాఘవేంద్రప్రసాద్ చెక్కును అందజేశారు. వీరిని కలెక్టర్ అభినందించారు.

హంద్రీ, కేసీ కెనాల్‌ను పరిరక్షించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు

కర్నూలు కల్చరల్: స్వచ్ఛ హంద్రీ, కేసీ కెనాల్, స్వచ్ఛ కర్నూలు కోసం పోరాడుదామని ఆ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రవహించే కేసీ కెనాల్, హంద్రీ నది గత కొన్ని సంవత్సరాలుగా కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. హంద్రీ, కేసీ కెనాల్‌లో పూడిక, చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలని, మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీ కెనాల్ చుట్టూ ఫెన్సింగ్, హంద్రీకి రక్షణ గోడ నిర్మించాలన్నారు. సాహితీ వేత్త చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ.. స్వచ్ఛ కర్నూలును సాధించే వరకు ఉద్యమం సాగించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు రామకృష్ణ, సీపీఐ కార్యదర్శి మునెప్ప, ప్రజాభ్యుదయ సంస్థ నాయకులు భార్గవ, జన విజ్ఞాన వేదిక నాయకులు శేషాద్రి మాట్లాడుతూ హంద్రీ నదిలో ఆక్రమణలను అరికట్టాలని కోరారు. కార్యక్రమానికి వివిధ ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, మేధావి వర్గం మద్దతు ప్రకటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకులు ఏఆర్‌కే డేవిడ్, మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



కురువ వీధిలో..



జొహరాపురం అల్లూరి నగర్‌లో..

ఏకదంతాయా.. బహురూపాయా



దేవనగర్‌లో..



బంగారుపేటలో..



తెలుగు వీధిలో..



సాయి వైభవ్ నగర్‌లో..



సూర్య నారాయణ స్వామి ఆలయంలో..

కర్నూలు కల్చరల్/సాక్షి ఫొటోగ్రాఫర్: వినాయక చవితి ఉత్సవాలు కనులపండువలా సాగుతున్నాయి. నగరంలో మూడో రోజు సోమవారం వినాయకుడి ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. మండపాల వద్ద హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల నిర్వాహకులు పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలనా గణనాథునికి నిర్వహించిన పూజల్లో జేసీ డాక్టర్ బి.నవ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఏక్యాంప్ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్, లేబర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయకునికి నిర్వహించిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.



లక్ష్మీనగర్‌లో..



సి.క్యాంప్ రైతుబజార్ వద్ద..



ఠాగూర్ నగర్‌లో..



మద్దూర్ నగర్‌లో..